# స్వామీజీ!

రచన :
శ్రీ ఆర్. కిషన్ రావు

(గతసంచిక తరువాయి)

స్వామీజీ ఏవో గోళీలు ఇచ్చి "ఈ గోళీలు రోజు కొకటి చొప్పున మ్రింగుము. తొమ్మిది నెలలు నిండగానే కొడుకు పుడతాడు" అని చెప్పాడు.

శకుంతల గోళీలు తీసుకొని సంతోషంతో వెళ్ళిపోయింది.

వివిధ రకాల కోరికలు కలవాళ్ళు స్వామీజీ చెంతకు వస్తున్నారు. అతడు చెప్పింది వింటున్నారు. అతడు అడిగినంత డబ్బు ఇస్తున్నారు. అతడు కరుణించి ఇచ్చిన గోళీలు తీసుకపోతున్నారు.

ఒకనాడు సాయంకాలం రంగనాథం స్వామీజీ చెంతకువచ్చి 'స్వామీ!' అని పిలిచాడు.

స్వామీజీ కళ్ళు తెరచి రంగనాథంను చూచి ప్రసన్న వదనంతో అన్నాడు, "ఏమిటి?"

అక్కడికి కనిపిస్తున్న కొండ శిఖరాలను స్వామీజీకి చూపిస్తూ చెప్పసాగాడు రంగనాథం. "ఆ కొండ దగ్గర దయ్యాల బంగ్లా వుంది. దయ్యాలు నివసించడం వల్లనే ఆ బంగ్లాకు దయ్యాల బంగ్లా అని పేరు వచ్చిందనుకొండి. అవి ఎప్పుడేం చేస్తాయో అని ఊళ్ళోని ప్రజలంతా భయపడిపోతున్నారు. మీరు ఈ వూరు విడిచి వెళ్ళేలోగా ఆ దయ్యాలను వెళ్ళగొట్టాలని వేడుకొంటున్నాను."

రంగనాథంగారు దయ్యాల ప్రసక్తి తేవడం విన్న ప్రజలు అతనిని అభినందిస్తున్నట్లుగా చూశారు.

స్వామీజీ చిరునవ్వు నవ్వి "అలాగే! ఇదే రోజు రాత్రి ఆ దయ్యాల బంగ్లాకు వెళతాను. ఆ దయ్యాల శక్తియుక్తులు తెలుసుకుంటాను. యుక్తితో ఆ దయ్యాలను వెడలగొడుతాను. మీరు నిశ్చింతగా వుండండి. మీకు మళ్ళీ ఇదే రావిచెట్టు క్రింద దర్శనమిస్తాను" అన్నాడు.

ఆ రోజు రాత్రి స్వామీజీ ఒంటిరిగా దయ్యాల బంగ్లాకు వెళ్ళిపోయాడు.

మరునాడు స్వామీజీ కోసం చాలామంది ప్రజలు రావిచెట్టు క్రిందకి వచ్చారు. స్వామీజీ కనిపించలేదు.

ఆ రోజు గడచిపోయింది. ఆ మరునాడు కూడా తెల్లవారకముందే చాలామంది ప్రజలు రావిచెట్టు క్రిందికి వచ్చారు.

చీకటిపడేవరకూ స్వామీజీ కోసం నిరీక్షించారు.

రంగనాథం ఇంటికి వెళ్ళబోతూ ప్రజల నుద్దేశించి అన్నాడు. దైవస్వరూపులైన స్వామీజీగారు దయ్యాలనన్నింటినీ పారద్రోలి రేపో ఎల్లుండో మన చెంతకు వస్తారు, సంతోషం కలిగిస్తారు.

రంగనాథం అన్న మాటలు విని అక్కడ గుమిగూడిన స్వామిభక్తులు చాలా సంతోషంతో ఇంటికి వెళ్ళిపోయారు.

నాలుగు రోజులు గడచిపోయాయి. అయినా స్వామీజీ రాలేదు.

అయిదవ రోజున చెట్టు క్రింద గుమిగూడిన ప్రజలకు స్వామీజీ శక్తిమీద అపనమ్మకం ఏర్పడింది. దయ్యాలు స్వామీజీని చంపేశాయేమోనని వాళ్ళు అనుమానపడ్డారు. ఆ రోజు గడచిపోయింది.

మరునాడుకూడా స్వామీజీ రాలేదు. ఆ మర్నాడు... ఆ మర్నాడు కూడా రాలేదు. పదవ రోజు తెల్లవారుజామున వాగువైపు వెళ్తున్న ఆడవాళ్ళకు స్వామీజీ కనిపించాడు. వాళ్ళు సంతోషంతో రావిచెట్టు క్రిందక్కి వచ్చారు. స్వామీజీ కళ్ళు మూసుకొని మౌనంగా కూర్చుని వున్నాడు.

దయ్యాలను పారద్రోలడానికి వెళ్ళిన స్వామీజీ తిరిగి వచ్చాడని ఊరందరికీ నిమిషాలమీద తెలిసిపోయింది.

ప్రజలు గుంపులు గుంపులుగా స్వామీజీ వద్దకు రావడం ప్రారంభించారు.

ఒకనాడు తెలతెలవారుతుండగా రామనాథం కంగారుపడుతూ స్వామీజీ వద్దకువచ్చి, బాధ నిండిన కంఠస్వరంతో అన్నాడు. "స్వామీ! రాత్రి మా యింట్లో దొంగతనం జరిగింది. అయిదు తులాల బంగారు గొలుసు పోయింది. మీరు మీ తపోబలంతో కనుగొని ఆ దొంగ ఎక్కడ వున్నాడో చెప్పండి స్వామీ!"

స్వామీజీ చిరునవ్వు నవ్వి "సర్వం జగన్నాథం! భక్తా నీ బంగారు గొలుసు ఎవరు దొంగిలించారో వచ్చే అమావాస్యనాడు చెప్తాను" అన్నాడు.

రామనాథం దిగులు పోగొట్టుకొని వెళ్ళిపోయాడు.

మరునాడు తెల్లవారుజామున చలపతి భార్య వచ్చి "స్వామీజీ! మా యింట్లో దొంగతనం జరిగింది నాలుగు ఉంగరాలు ఒక రేడియో పోయాయి. ఆ దొంగవెధవ ఎవడో తెలుసుకొని చెప్పండి" అంది ఏడుస్తూ.

స్వామీజీ కనుబొమ్మలు ఎగరవేసి చిరునవ్వు నవ్వి అన్నాడు. "సర్వం జగన్నాథం! ఏమిటో ఈ కలియుగంలో పాపుల సంఖ్య పెరిగిపోవుచున్నది. దొంగతనాలు, హత్యలు మితిమీరుచున్నవి. అందుకే ఆ బోలా భగవంతుడు నన్ను ఇక్కడకు పంపాడు. జరిగిన దానికి విచారించకు భక్తురాలా! నీ వస్తువులు ఎవరు దొంగిలించారో వచ్చే అమావాస్యనాడు చెప్తాను. ఇక నీవు నిశ్చింతగా వుండవచ్చును.

ఆమె కళ్ళు తుడుచుకొని వెనుదిరిగి ఇంటివైపు నడక సాగింది. అదే సమయంలో ఒక నూతనవ్యక్తి ఆమెవద్దకు వచ్చి "దొంగిలించబడిన మీ వస్తువులు ఎక్కడ వున్నాయో నేను చూపిస్తాను రండి" అన్నాడు.

స్వామీజీ ముఖంలో రంగులు మారాయి. అతడు దిగ్గున లేచి నిలబడి జోలె భుజాన వేసుకొని "నన్ను నమ్ముకున్న భక్తులారా! మనుష్యులు సంచరించని ఆ కొండపై కూర్చుండి మీ వస్తువులను దొంగిలించిన ఆ దొంగ ఎక్కడ వున్నాడో నా తపోబలంతో తెలుసుకొనివచ్చి మీకు చెప్తాను" అని చెప్పి కొండవైపు గబగబా నడవసాగాడు.

ఇంతలో నూతనవ్యక్తి స్వామీజీ వద్దకు పరుగెత్తి వచ్చి జోలె లాక్కొని బోర్లించాడు అది చూచి ప్రజలంతా ఆశ్చర్యపోయారు.

బంగారు గొలుసు, బంగారు ఉంగరాలు, రేడియో రూపాయల కట్టలు, బట్టలు, ఎర్రని బైండుగల పుస్తకం, కొన్ని రకాల గోళీలు, బూడిదలాంటి పదార్థం నేలపైన పడ్డాయి.

నూతనవ్యక్తి కృత్రిమ గడ్డం లాగేశాడు. ప్రజలు మరింత ఆశ్చర్యపోయారు. కొందరు స్వామిజీని తిట్టడం ప్రారంభించారు.

నూతనవ్యక్తి ప్రజల నుద్దేశించి అన్నాడు. "అమాయకులైన మిమ్ములను మోసగిస్తున్న స్వామిజీ గుట్టు బయటపెట్టిన నేను సి ఐ డి సునిల్ కుమార్ ను. ఇతడు దోషి అని కోర్టులో రుజువు చేయడానికి మీ సహకారం కూడా కావాలి. మీలో ఎవరి వస్తువులు పోయాయో వాళ్ళంతా కోర్టుకు రండి. అక్కడే ఎవరి వస్తువులు వాళ్ళకు ఇవ్వబడుతాయి." -

ప్రజలు సునిల్ కుమార్ వైపు ప్రశంసా పూర్వకంగా చూస్తుండగా సునిల్ కుమార్ పోలీసువారి సహాయంతో దొంగ స్వామీజీని పట్టుకొని ముందుకు సాగిపోయాడు.




ఎల్లప్పుడూ...

ఒలింపిక్
బ్లూ బర్డ్ బనియన్లనే
ఉపయోగించండి.

: తయారించువారు :

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని తిరుపూరు - 638 604